సుఖంగా, శాంతంగా ఉండగలగడం ప్రజాబాహుళ్యానికి ఎన్ని యుగాలైనా కుదరలేదు. జీవితపు పై పొరల్ని స్పృశించి ఆశల ఇంద్రజాలపు మెరుపుల్లో లీనమవుతారు సామాన్యులు. అత్యాశ ధనస్వామ్యపు దాంబికంలోకి దింపి అభద్రత కల్పిస్తుంది. డబ్బు చొరబడని ప్రదేశం లేదు. అవకాశాలు విశ్వాసాలను కూడా మార్పించగలవు. కాలం విచిత్రమైనది. అయినా జీవితం తన దారిన తాను వెళుతుంది. ఊహించని మలుపులు తిరుగుతుంది. తిరిగి తిరిగి ఉన్నచోటుకే చేరుకుంటాం. మూలాల్లోకి ప్రయాణిస్తాం. ఇదంతా అసంకల్పిత పరిణామక్రమం కావచ్చు. చాలా ఏళ్ళ తర్వాత నేను మా ఊరికి రావడం అలాంటిదేనేమో!!

మా గ్రానైట్ ఫాక్టరీ నిర్మాణంలో సమస్య ఎదురైంది. ఊరు చిన్నదైనా సమస్యను సృష్టించిన శక్తులు బలీయమైనవి. ఫాక్టరీ స్థలం ఒంగోలు పక్కన చిన్న ఊరులో వుంది. ఫాక్టరీ స్థలం ఈశాన్యభాగంలో పెద్ద ఎత్తుగా రాళ్ళు వున్నాయి. రాగిచెట్టూ, వేపచెట్టూ పెద్దవి పెనవేసుకున్నాయి. ఈశాన్యం ఎత్తు ఉండకూడదు రాళ్ళు తీసి చెట్లు కొట్టేద్దామని సిద్ధాంతులు నిర్ణయించారు. చెట్టుకు పూజలు చేస్తున్నామని రాయి ఎప్పుడిదో గాని స్వామిగా ఆరాధిస్తున్నామని గ్రామస్థులు చెప్పారు. అక్కడినుంచి వేరే ప్రదేశానికి రాయిని మార్చి అక్కడే చెట్లు నాటుదామని ఒప్పించాము. పెద్ద మొత్తానికి గ్రామపెద్దలు అంగీకరించారు. రాజీ పూర్తయి బయలుదేరు సమయంలో కారుకు అడ్డంగా చిన్న పిల్లలు వలయంగా ఏర్పడ్డారు. చెట్టు కూల్చడం వీలులేదని, వద్దని గోల చేశారు. ఈ రాళ్ళమధ్యే తాము ఆడుకునేవారమని ఏడ్చేశారు. పెద్దవాళ్ళు వచ్చి వారిని సముదాయిస్తున్నారు.

'స్కోడా' కారు కదిలింది. రెండు రాళ్ళు కారు వెనుక అద్దానికి బలంగా తగిలాయి. వెనక్కు తిరిగి చూశాను. పిల్లలు కళ్ళు కసితో వున్నాయి. కేకలు పెడుతున్నారు.

** ** **

చీమకుర్తి గ్రానైట్ గెలాక్సీ పుణ్యమా అని దాదాపు నలభై సంవత్సరాల తరువాత ఒంగోలు రావటం జరిగింది. ఫాక్టరీ ఒంగోలుకు దగ్గరలో నిర్మాణం అవసరమైంది. బెంగుళూరులో జరిగిన గ్రానైట్ ఎగ్జిబిషన్‌లో చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ గొప్పతనం ఖండఖండాంతరాల వ్యాపారులను ఆకర్షించింది. అదృష్టవశాత్తూ గొప్ప బల్క్ ఆర్డరు రావడం దానికోసం ఇక్కడికి రావడం జరిగింది. రాచరికపు అందాల్ని గర్భంలో దాచుకున్న చీమకుర్తి కొండలు, రామతీర్థ క్షేత్రం వెలుగులు చిందిస్తున్నాయి.


నా చిన్నతనం ఒంగోలులోనే గడిచింది. నాన్న కోట్ల బజారు దుకాణాలలో లెక్కలు రాస్తుండేవారు. దుకాణదారులు మాయింటికి సరుకులు, సాయంత్రం వేళలో తినుబండారాలు పంపిస్తుండేవారు. అల్లూరయ్య మైసూరుపాకు, పుల్లయ్య పులిబొంగరాలు యిష్టం నాకు. పొద్దుపోయాక వచ్చేవారు నాన్న ఇంటికి. నిద్రలేపి తినిపించేది అమ్మ. నాన్నంటే అందరికీ చాల గౌరవం. ఆధ్యాత్మిక విషయాలు, సాయంత్రం కొండమీద పురాణ ప్రవచనం చేసేవారు.

# ఐలాండ్ విల్లా

డా॥ ధేనువకొండ శ్రీరామమూర్తి

కథ

నాకు సంతపేటలో కంపెనీ గెస్ట్‌హౌసులో బస. సంతపేటలో బాగా ధనికులు ఉండేవారని అనుకుండేవారు. ధారావారి తోట, రాఘవాచారి ఆసుపత్రి, బివియల్ నారాయణ హాస్పిటల్ వుండేవి. కొండ పక్కగా రైల్వే బొగ్గు క్వారీ వుండేది. ఎప్పుడో వచ్చే రైల్వే వాగన్లకోసం రైల్వే లైను వుంది. మేము కొత్తపేటలో వుండేవారం. ఇది ఈ చివర సంతపేట ఆ చివర వుండేవి. మాకు సమీపంలో రంగారాయుడు చెరువు వుంది. పెద్ద చెరువు కట్టతో, మంచి నీటికి, వాడుక నీటికి వేరు వేరుగా ఉండేది. కట్ట మీద పెద్ద పార్కు కట్టించి అప్పటి కమిషనర్ తన విగ్రహాన్ని పెట్టించుకున్నాడు.



పార్కు మధ్యలో గాంధీ విగ్రహం వుండేది.

చెరువులో ఏటా తెప్ప ఉత్సవం చేసేవారు. ఉత్సవంలో బొమ్మరాజు, మైనంపాటి, సూచిరకవి వంశీకులు నారాయణ తీర్థులు తరంగ కాలక్షేపం చేసేవారు.

అందరికీ ఆకర్షణీయమైనది ఆంధ్రకేసరి ప్రకాశంపంతులు మేడ 'ఐలాండ్ విల్లా'. రాచరికపు ఠీవిలో వుండేది. మేడముందు పోలేరమ్మ గుడి. కొండమిట్ట నుంచి చిన్నవాగు ఇంటిముందుగా ప్రవహించి ఊరి చెరువులో కలుస్తుంది. వాగు ఇబ్బంది లేకుండా మునిసిపాలిటీవారు ఇంటి చుట్టూ రాతికట్టడంతో దిట్టమయిన కట్టుబడి చేశారు. వాగుమీద చిన్న వంతెన, ఇంట్లోకి వంతెనమీదుగా వెళ్ళాలి.కారు షెడ్డు భవనం వెనుక వైపు వుంది.

పెద్ద పెద్ద చెట్లతో భవనం గంభీరంగా వుండేది. భవనాన్ని చుట్టి వాగు వుండటంవల్ల 'ఐలాండ్ విల్లా' అని ఆయన పేరు పెట్టారు. ఆయన సంపద కరిగిపోయినట్లే ఆయన యిల్లు చేయి మారింది.

ఆంధ్రకేసరి భవనం పక్కగా రోడ్డుకు అటువైపు పెద్దపెద్ద చెట్లతో చింత తోపు. ఆ చింతచెట్ల మధ్య వుండే ఎలిమెంటరీ స్కూలు తోపులో బడి. మరీ ప్రకాశం పంతులుగారి యింటిపక్కనే అవటం మూలాన స్కూలు పంట పండి మంచి విశాలమయిన భవంతి బంగళా పెంకులతో చింత తోపులో కట్టించారు. అదే తోపులో బడి. చాలా ఆకర్షణీయంగా వుంటుంది అన్ని రకాల ఆటలు ఆడుకుంటుండేవారు.

హెడ్మాష్టరు ఘోరకవి పంతులు. జరీ తలపాగా, వేస్టుకోటుతో, ఖద్దరు పంచె, నుదిటి మీద నల్లటి చాదుబొట్టు, మేజోళ్ళు లేని బూట్లతో హుందాగా వుండేవారు. బతకలేక బడిపంతులు కాకుండా బతుకులు పండించే బడిపంతులుగా వుండేవారు. నారాయణ తీర్థుల తరంగ కాలక్షేపం బాగా చేసేవారు. కేను బెత్తం చేతిలో ఎప్పుడూ వుంచుకొనేవారు.

ఎవరైనా రెండు రోజులు స్కూలుకు రాకపోతే తను స్వయంగా ఇంటికి వచ్చి కారణం కనుక్కునేవారు. లేదా వెంకమ్మను పంపేవారు.

రోజూ ప్రార్థన అసెంబ్లీ వుండేది. ఆలస్యంగా వస్తే ముందు వరసలో నిలబెట్టేవారు. కారణం గుచ్చి గుచ్చి అడిగేవారు. ఒకణ్ణి అందరూ పొట్టి బావని పిలిచేవాళ్లం. వాడు ఆలస్యంగా వచ్చాడు.

"ఎందుకురా ఆలస్యంగా వస్తున్నావు?" ఘోరకవి అడిగాడు.

"తాతయ్య తరంగాలు చెప్తున్నాడు సార్! అందుకనే ఆలస్యం అవుతున్నది" తడుముకోకుండా చెప్పాడు.

ఒక్కసారిగా వాణ్ణి ఎత్తుకొని ముద్దాడాడు.

"బాగా నేర్చుకోవాలిరా" అంటూ భుజం తట్టారు. వాణ్ణి చూసి అందరు అదే ఛెప్పడం మొదలెట్టాము.

ఆ సంగతి పసిగట్టారు.

"సరే అందరూ కలిసి పాడండిరా" అన్నారు హెడ్మాష్టరు.

ఇంకేముంది అందరం ఏడుపు లంకించుకున్నాం. అర్థం చేసుకున్నారు.

కూర్చోబెట్టి మొదటి తరంగం నేర్పించారు. స్కూలును అంటిపెట్టుకున్న వాచ్‌మన్ రెడ్డి, వెంకమ్మల దాంపత్యం చిత్రంగా వుండేది. పోట్లాడుకునేవారు, కలిసిపోయేవారు.. ఉదయం ఆరు గంటలకే చంకలో బెత్తం పెట్టుకొని వీధి వీధిలో తిరుగుతూ కేకలు పెడుతుండేది. రెడ్డి స్కూలు ఆవరణ శుభ్రం చేసి మంచినీరు ఏర్పాటు చేస్తుండేవారు. పెద్ద పెద్ద బానలు వుండేవి. వాటిలో చింతాకు పోసేవాళ్ళం. ఆటబట్టించి, నీళ్ల పాడయినాయని హెడ్మాష్టరుతో తిట్టించేవాళ్లం.

అప్పుడప్పుడు చింతచెట్ల మధ్య పెద్ద సుడిగాలి వచ్చేది. సుడిగాలికి దూరంగా వుండమని, ఉమ్మివేయవద్దని కేకలు పెట్టేది. సుడిగాలిలో దెయ్యం వుంటుందని భయపెట్టేది.

మల్లవరపు కిష్టిగాడు ధైర్యం చేసి ఉమ్మివేశాడు ఒకరోజు. దురదృష్టవశాత్తూ కాకతాళీయంగా కిష్టిగాడి అమ్మ చనిపోయింది ఏకారణం చేతనో. అందరం వారం రోజులు స్కూలు మానేశాం. చిమ్మచీకటి రాత్రిపూట స్కూలులో శబ్దాలువచ్చేవి. రాత్రిళ్ళు రెడ్డి తాగి గలభా చేసేవాడుట.అక్కడి శబ్దాలకు పెద్దవారు ఇళ్ళకి చేరుకొని కథలు కథలుగా దెయ్యాలు రాత్రిళ్ళు తిరుగుతున్నాయని చెప్పుకొనేవారు. చింతచిగురుల్ని అందరికీ పంచేవారు.

రంగయ్య మాష్టరు ఇంగ్లీషు సినిమాలు బాగా చూసేవారు. సినిమా కథలు తెగ చెప్పేవాడు. అందరూ గుమికూడి కథలు చెప్పించుకునేవారు. సుందరమ్మ టీచరు సింగ్ హోటల్నుంచి పెసరట్లు తెప్పించుకొనేది. వెంకటేశ్వర్లు మాష్టరు మణీ హోటల్నించి స్పెషల్ కాఫీ తెప్పించుకొనేవాడు. విక్టోరియా, సీతమ్మ టీచర్లు పోటీబడి సింగారించుకొని ఫాషన్ బొమ్మల్లాగా వచ్చేవారు.


తల్లావఝుల శివశంకరస్వామిగారి యిల్లు స్కూలుకు పక్కనే పడమట వైపు వుండేది. ఆంధ్ర సాహితీ లోకంలోని హేమాహేమీలు తరచుగా ఆ యింటికి వస్తుండేవారు. భారతుల మార్కండేయశర్మగారు, ధారారామనాథశాస్త్రి శర్మగారు, వావిలాల, నోరీ నరసింహశాస్త్రిగారు కలిస్తే సాహితీ చర్చలు జరుగుతుండేవి.

వీరి పిల్లలు అందరూ తోపులో బడిలోనే చదువుకునేవారు, పెద్ద పెద్ద లాయర్లు, లెక్చరర్ల పిల్లలు గూడా వచ్చేవారు.

తూర్పు వీధిలో గాన సరస్వతి ధేనువకొండ సుబ్బారావు పంతుగారింట్లో మహావాది వెంకటప్పయ్య సూరి, శేఖరం బొమ్మరాజువారు సంగీత చర్చలు, కచేరీలు జరుగుతుండేవి. పాంచలవరపు ప్రసాదరావు కరణం. కరిణీకం కంటే త్యాగరాజ ఉత్సవాలలో మునిగితేలేవారు. సంగీత సాహిత్యాలకు అనుసంధానమై వుండేవారు.

హెడ్మాష్టరు గారిని, టీచర్లను చూడాలని మాట్లాడాలని అనిపించింది. నోస్టాల్జియా మనసులో చోటు చేసుకుంది. ఎవరెవరు ఎక్కడ వున్నారో కనుక్కోవడం సమస్యగా మారింది. అయినా బయల్దేరాను. కారు దారిని వెదుక్కుంటూ 'జువెట్' మెమోరియల్' చర్చిమీదుగా వెళ్తున్నది.

చర్చి నిర్మాణం రోజుల్లో మా అమ్మ



తాతగారు చర్చి నిర్మాణంలో దొరలకు దుబాసీగా సహాయంచేసేరని ఎన్నో సార్లు చెప్పుండేది. సివియన్ రీడింగ్‌రూమ్ వద్దకు రాగానే ఎందుకో లోనికి వెళ్లాలనిపించింది. కారును లోనికి పోనివ్వమన్నాను. ఆధునికతతో అన్ని సౌకర్యాలు సమకూర్చుకొన్నది క్లబ్. ఆ రోజులలో ప్రకాశం పంతులు బిలియర్డ్స్ ఆడేవారట. క్లబ్బుకు బిలియర్డ్స్ టేబుల్ బహుమతిగా ఇచ్చేశారు. రూములోకి వెళ్ళి చూశాను. టేబిల్ మీద యువకులు గేమ్ ఆడుతున్నారు.

అప్పట్లో పురప్రముఖులకు జీవనశైలిలో హై సొసైటీ కల్చర్ అందించారు.

కొన్ని టేబుల్స్ దగ్గర పేకాట ఆడుకుంటున్నారు. మేడమీద డ్రామా పద్యాలు హార్మోనియం మీద ప్రాక్టీసు చేసుకుంటున్నారు. నా ఉనికిని గమనించిన కొందరు ఇటువైపుగా చూసి వాళ్ళ పనిలో నిమగ్నమైనారు.


ఒకరిద్దరు నా వైపుగా వేగంగా దూసుక వచ్చి నన్ను గుర్తు తెచ్చుకుంటూ.... "మీరు... మీరు..." అని ఆగిపోయారు. చేతులు చాపి వారిని ఆహ్వానించాను. దగ్గరగా వచ్చారు.

"మీరు డెఫినెట్‌గా అబ్బాయిపంతులుగారి అబ్బాయి మురళి" ముఖం మీద మచ్చవల్ల గుర్తు పట్టాను. "థాంక్స్ లాట్, గుర్తు పట్టినందుకు, మీరు హరిశంకర్" అంటూ గట్టిగా చేతులు నొక్కాడు.

"రండి కూర్చుందాం" అంటూ పక్కనే వున్న అతన్ని పరిచయం చేశాడు.

హెడ్మాష్టరు, రంగయ్య మాష్టరు, మిగతా టీచర్ల గురించి అడిగాను. హెడ్మాష్టరు కాలం చేశారని వారి పిల్లలు ఇక్కడే ఉద్యోగం చేస్తున్నారని, రంగయ్య మాష్టరు సీతారామపురం కాలనీలోనే వున్నారని, పిల్లలు ఇద్దరు అమెరికాలో వున్నారని చెప్పారు. కొండల మధ్య చిన్న కాలనీ సీతారామపురం. మురళితో కలిసి బయల్దేరాను.

సి.యస్.ఆర్.శర్మ కాలేజీ మీదుగా వెళ్తున్నాం. వయసు ఉడిగిన వృద్ధనారిలాగ వుంది కాలేజీ. కాలేజీ ముందు భుజాలమీద కాకిరెట్టలతో వివేకానందుడు (విగ్రహం) చేతులు ముడుచుకునే నిల్చున్నాడు. చిరంజీవి మేష్టారు చెప్పిన 'హాపీ ప్రిన్స్' ఇంగ్లీషు కథ గుర్తుకొచ్చింది. ఎన్నో త్యాగాలతో చివుకులవారి కాలేజి నిలబడింది. ఆనాటి త్యాగాలు, ఆశలు, కలలు నేడు వెలుగులు చిందిస్తున్నాయి. ముత్తు అయ్యర్, పాపాలి, రామచంద్రరావు పున్నయ్యలాంటి హేమాహేమీలు పనిచేశారు.



వివిధ పాత్రలకు తన గళాన్ని మారుస్తూ మర్చెంట్ ఆఫ్ వెన్నీస్, ఒథెల్లో డ్రామా సన్నివేశాలు ముత్తు అయ్యర్ డైలాగులు సజీవంగా వున్నాయి. ప్రిన్సిపాల్ ముత్తయ్యర్ డ్రామా క్లాసు అంటే మిగతా క్లాసుల విద్యార్థులు కిటికీ పక్కకు చేరి వినేవారు. అదే స్థాయిలో తెలుగు పద్యాన్ని ధారా రామనాథశాస్త్రి ఉపన్యాసాన్ని యం.వి.యస్. శర్మ వినిపించేవారు.

చిన్న యింటిముందు ఆగింది కారు. చిన్న గేటు తెరుచుకొని లోనికి వెళ్ళాం. కుక్కపిల్ల అరుపులు వినిపించాయి.

"మాష్టారూ!" అంటూ మురళి లోనికి నడిచాడు. నేను అనుసరించా.

"ఎవరూ!" అంటూ పెరిగిన గడ్డాలతో కొయ్యబల్ల మీద పెద్దమనిషి కొంచెం కదిలాడు. ఒళ్ళొంచి పిల్లి లేచి లోనికి పరుగెత్తింది.

"నేను మాష్టారు, అబ్బాయి పంతులుగారి మురళిని"

"రా...రా... రావయ్యా, ఎండవేళ వచ్చావు" అంటూ పక్కన వున్న నన్ను పరిశీలనగా చూసి "ఎవరూ!" అన్నాడు.

"మీ ప్రియశిష్యుడు మిమ్మల్ని చూడాలని బెంగుళూరు నుంచి వచ్చారు. గుర్తు తెచ్చుకోండి" అన్నాడు మురళి.

నవ్వుతూ దగ్గరకు వెళ్ళాను. తనివితీరా తడిమారు.

"బహుశా శంకరుడేమో!"

"ఎట్లా గుర్తుబట్టారు మాష్టారు"

"బెంగుళూరులో వున్నది నా శిష్యుల్లో శంకరుడే గదా! తరచూ నీ గురించి, నీ ఉన్నతస్థితి గురించి వింటున్నానయ్యా"

"ఎట్లా వున్నారు మాష్టారు"

"నిర్మోహానికి-నిశ్చలతత్వానికి మధ్యలో వున్నానయ్యా"

"పిల్లలిద్దరూ అమెరికాలో వున్నారట గదా? వెళ్ళలేదా మాష్టారు."

"శంకరా నిజం చెప్పేదా, అక్కడి కుటుంబ వాతావరణం మనకు నచ్చదు. అదీగాక ఇక్కడివారు అంతా కలసి ఇంకా బతికివున్నందుకు సహస్రచంద్రదర్శనం, శాంతి హోమం, మృత్యుంజయ హోమం జరిపిస్తూ కొడుకులకు రమ్మని తెలియచేశారు. వారు రాలేదు సరికదా ఈ రోజుల్లో ఈ చాదస్తాలేమిటని వీడియో తీసి పంపమని 200 డాలర్లు పంపారు.

చాదస్తులకు విలువలేని వాతావరణంలో ఇమడలేము కదా, ఈ శునక మార్జాలాలే ఇహలోక సంబంధీకులు" అంటూ పక్కనే వున్న వాటిని చూపించారు. అంతలో గేటు దగ్గర శబ్దమయింది, అందరం చూశాం. పండు ముసలి నెమ్మదిగా లోనికి వచ్చారు. శంకర మఠం అవధానిగా పరిచయం చేశారు. నమస్కరించాను ఆయన ప్రతినమస్కారం చేశారు.

ప్రదూష వేళలో ఇక్కడ వేదం అధ్యయనం చేసుకుంటారట. పండితులను బట్టి విద్యలకు కూడా గౌరవం కలుగుతుందనిపించింది వారిని చూశాక. సాయంత్రం కొండమీద దేవాలయంలో రంగయ్య మాష్టరు పురాణ ప్రవచనం చేస్తారట. అక్కడి ప్రసాదం వీరి ఆహారం. అవధాని గారి పిల్లలు కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే. ఆయన పరిస్థితి ఇదే కావటం విషాదం.

ఎదిగి వచ్చిన పిల్లలు అందికలో ఆదరువుకాని విషాదం. ఆదుకోలేని అంతరం. విధి వైచిత్ర్యం, కాలస్వభావం.

"శంకరా ఆశ్చర్యపడకు. మేమే కాదు, అటు చూడు మొక్కల దగ్గర వున్నాడు కొండయ్య. మీరు ఎప్పుడూ కూర్చునే కొండయ్య బంకు వాడిది. ఎదిగిన పిల్లలు మంచి ఉద్యోగాలు, మంచి సంబంధాలతో పెళ్ళిళ్ళు, మనవలు, మనవరాళ్ళు, వాళ్ళ పిల్లలని కొండయ్య బంకు పిల్లలని అంటున్నారని ఇటు రావటం మానేశారు".

"మరి మీ బాధ్యత"

"అందరిదీ. కలిసే వుంటున్నాం. వృద్ధాప్యం నిజంగా శాపం శంకరా!"

"చాలా బాధగా వుంది మాష్టారూ!"

"వాతావరణంలో దుమ్ము అణువులు, అంతరిక్షంలో చీకటి బిలాలు, వెలుగు రేఖలు లేకపోతే ఆకాశానికి అన్ని రంగులు వచ్చేవా? జీవితం అంతే శంకరా! అదీ తెలుసు, ఇదీ తెలుసు"

ఆయన అంత తేలికగా తీసుకున్నా విషయ గాంభీర్యం నన్ను ఆలోచనలో పడవేసింది.

"శంకరా నీ మనస్సు కష్టపెట్టినట్లున్నాను, నా ఉద్దేశం ఆత్మీయుడవని వెల్లడించాను. దాదాపు మనస్సు నిశ్చలమయింది. విషయ వాసనలు కొడిగట్టుతున్నాయి".

"లేదు మాష్టారు మిమ్మల్ని మరలా కలుస్తాను"

ఏదైనా వీరికి చేయాలనే తపన మొదలయింది మనస్సులో. వేగంగా బయటికి వచ్చేశాను. మనస్సు వికలమైంది.

కారు కోర్టు సెంటరు మీదుగా వెళ్తోంది. సెంటర్‌లో అన్నమ్మ మేడ నేలమట్టం అయింది. ఎందరికో టైపు ద్వారా ఉద్యోగభిక్ష చేసిన రమణయ్య టైప్ ఇన్‌స్టిట్యూట్ కాలగర్భంలో కలిసిపోయింది. హైస్కూళ్ళకు హిందీ పండితులను తయారుచేసిన కామేశ్వరరావు సాహితీ సదన్, బచ్చన్ మధుశాల గేయాలగానం, పివిఆర్ స్కూలులో శేషేంద్రశర్మ ప్రజావిష్కరణంచేసిన కవిసామ్రాట్ విశ్వనాథ ఉపన్యాసాలు గాలిలో కదులుతూనే వున్నాయి.

కారు ముందుకు సాగింది.

నేను ఎంతో ఆశగా చూడలనుకున్న 'ఐలాండ్ విల్లా' కనబడలేదు. ఆ స్థలంలో భవన శిథిలాలు చిందరవందరగా వున్నాయి.

"భవనం ఏమైందని" అడిగాను.

అపార్టుమెంట్ల కోసం పడగొట్టారని చెప్పారు.

నేలమట్టమయిన నిటారు భవనాన్ని చూసి ఆశ్చర్యపోయాను. నిండు గుండె చూపి "కాల్చండిరా" అన్న ప్రకాశం పంతులు కేక శిథిలాల మధ్య పీలగా వినిపిస్తోంది. ఆంధ్రులెవరూ పట్టించుకోని ఆంధ్రకేసరి భవనం 'ఐలాండ్ విల్లా' శిఖరాలు కూలిపోయి నేలను పరుచుకుంది.

ఆవిరయిన ఆంధ్రుల పౌరుషం అధ్వాన్నమయింది. పక్కనే వున్న తోపులో బడి రాజ ప్రసాదం కోల్పోయిన రాజమాతలా వుంది.

వెనుకవున్న అండాళ్లమ్మ గడియారం మేడ కాలాన్ని చూపటం మానేసింది. ఇష్టమైనది కోల్పోయిన విచారం కుదిపేసింది. కారుపై రాయి విసిరిన చిన్నారుల కళ్ళలోని కసి వెలుగులు కనిపించాయి.

వెంటనే ఫాక్టరీ సైటుకు ఫోను చేసి, రాళ్ళను కదిలించవద్దని, చెట్లను కొట్టెయ్యవద్దని చెప్పాను. గొప్ప రిలీఫ్ అనిపించింది.

ఎకరం స్థలంలో చెట్లు, రాళ్ళ గుట్ట చుట్టూ అందంగా 'కణ్వ వృద్ధాశ్రమం' ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాను.

కారు రంగయ్య మాష్టారింటికి వెనుదిరిగింది.

*('రాజమండ్రి వద్ద కణ్వ వృద్ధాశ్రమం' నిర్మాణం చేస్తున్న జొబ్బాగారికి కృతజ్ఞతలతో...)*